## ‘ప్రభుత్వ సంక్షేమ పథకాలే కందాళను గెలిపిస్తాయి’



మాట్లాడుతున్న నాగుబండి శ్రీనివాసరావు

కూసుమంచి (నేలకొండపల్లి), అక్టోబర్ 15: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపిస్తాయని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కందాళకు అధిక మెజార్టీ అందించడం కోసం ప్రతీ ఒక్కరూ మరింత కష్టపడి పని చేయాలని కోరారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు మరో 45 రోజులు మాత్రమే గడువు ఉన్నందున గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే కందాళ చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కందాళను గెలిపించడానికి పాలేరు నియోజకవర్గంలోని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. నాయకులు కోటా సైదిరెడ్డి, మారగాని పద్మనాభరావు, కొర్లకుంట వీరభద్రం, కుక్కల సామేలు, బచ్చల కూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

వైరా రూరల్, అక్టోబర్16: మండలంలోని సిరిపురం(కెజి) గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ అభ్యర్థి మదన్‌లాల్‌ను గెలిపించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కామినేని శ్రీనివాసరావు, మోరంపూడి బాబు, ప్రసాద్, అయోధ్య రామయ్య, శెట్టిపల్లి శ్రీనివాసరావు, వాకదాని వీరభద్రం, రామలింగం, చప్పిడి భాస్కర్, పుచ్చకాయల బాబు, పూర్ణకంటి రవి, తడికమళ్ళ కృష్ణార్జున, పాటిబండ్ల శ్రీనివాసరావు, మట్టూరి సత్యనారాయణ, తడికమళ్ళ రామారావు, శరత్, కిరణ్ పాల్గొన్నారు.

## అమ్మవారికి పూజలు



కోలాటం ఆడుతున్న మహిళలు

కారేపల్లి, అక్టోబర్ 16: మండలంలోని దేవీశరన్నవరాత్రి ఉత్సవ మండపాలలో అమ్మవారికి భక్తులు సోమవారం పూజలు చేశారు. పెద్దమ్మ దేవాలయంలో గాయత్రీదేవి, కారేపల్లి క్రాస్‌రోడ్‌లో బాలత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్, గేట్‌రేలకాయలపల్లి, కోట మైసమ్మ దేవాలయ ప్రాంగణాల్లోని మండపాల్లో దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. కారేపల్లి క్రాస్‌రోడ్‌లోని దుర్గామాత మండపం వద్ద మహిళలు కోలాటం వేశారు.

వైరా టౌన్, అక్టోబర్16: స్థానిక కోదండ రామాలయంలో అమ్మవారు గాయత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

# ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన అవసరం

### కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 16: ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అర్హత, అనర్హత, నామినేషన్ స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపుపై సోమవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏఎల్ ఎంటీ, ఏఆర్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం అధికారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్క్రూటినీ ఎంతో కీలకమైనదని చెప్పారు. దీనిని నిబంధనల ప్రకారం నిర్వర్తించాలన్నారు. ప్రతిపాదిత వ్యక్తికి సంబంధిత నియోజకవర్గంలో ఓటు హక్కు ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

వైరా టౌన్, అక్టోబర్16: వైరాలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వైరా అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్(గోడౌన్)ను, పరిసర ప్రాంతాలను కలెక్టర్ గౌతమ్ సోమవారం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్, అదనపు కలెక్టర్/రిటర్నింగ్ ఆఫీసర్ సత్యప్రసాద్, అడిషనల్ సీపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు ‘సీ విజిల్’, అనుమతులకు ‘సువిధ’

ఖమ్మం రూరల్, అక్టోబర్ 16: ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులకు సీ విజిల్ యాప్, అనుమతులకు సువిధ సైట్‌ను కేంద్రం ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిందని పాలేరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి తెలిపారు. సోమవారం సాయంత్రం తహసీల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎన్నికల డీటీ రవీందర్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగేందుకు సామాన్యులు సైతం తగిన ఫొటో/వీడియో ఆధారాలతో సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. ఈ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందిస్తారని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఎట్టి పరిస్థితిలోనూ బహిర్గతం కాబోవని స్పష్టం చేశారు. అభ్యర్థులు సమావేశాలు, మైక్, వాహనాలు, ర్యాలీలు తదితర అనుమతుల కోసం సువిధ అనే వెబ్‌సైట్‌ను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులకు తహసీల్ కార్యాలయంలో 08742-252566 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1950 సేవలు కూడా పొందవచ్చన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 289 పోలింగ్ కేంద్రాలకు 27 మంది రూట్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. ఎన్నికల నిబంధనల కేసులు ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఒక్కోటి చొప్పున నమోదు చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు నమోదుకు ఈ నెల చివరి వరకు గడువు ఉందన్నారు.

## గంజాయి పట్టివేత



గంజాయి సంచులు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 16: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఇల్లెందు ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపిన వివరాలు.. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన గాణిపాక సాయికృష్ణ, బల్లి నరసింహ కలిసి బైక్‌పై భద్రాచలం నుంచి వరంగల్‌కు గంజాయి తరలిస్తున్నారు. మండలంలోని కొరెంటాఫీస్ ఏరియాలో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారికి వీరిద్దరూ పట్టుబడ్డారు. వీరి నుంచి తొమ్మిది కేజీల ఎండు గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.2.25 లక్షలు ఉంటుంది. గంజాయిని స్వాధీనపరుచుకుని, వారిద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు రమాదేవి, గౌతమ్, కానిస్టేబుళ్లు రామకృష్ణ, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్, పాషా, రవి, తులస్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ఇల్లెందు క్రీడాకారులు ‘బంగారం’

ఇల్లెందు, అక్టోబర్ 16: ఐదు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో స్థానిక దుర్గా గోల్డెన్ జిమ్ క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు సాధించారు. జిమ్ నిర్వాహకుడు కావేటి రమేష్ సోమవారం విలేకరులతో ఈ విషయం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలోని జైన్ మందిరంలో సోమవారం ఐదు జిల్లాల స్థాయి స్త్రీలు, పురుషుల బెంచ్ ప్రెస్ పోటీలు జరిగాయన్నారు. తమ జిమ్ క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. ఈ నెల 21న జరగనున్న రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో వీరు పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులు చీమల సుజాత, చింతా నాగరాజు, శ్రీనివాస్‌రావు, రాజ్‌కుమార్, దయాకర్, సందీప్, రాంకిషన్, మాధవి, సంపత్, ఎస్.కె.నజీర్, శ్రీను, డాక్టర్ గట్టేశం, భార్గవ్, నవీన్ పాల్గొన్నారు.

## మదన్‌లాల్ గెలుపునకు ప్రచారం

జూలూరుపాడు, అక్టోబర్ 16: వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు.

## ఇల్లెందు మట్టి.. ఢిల్లీకి

ఇల్లెందు, అక్టోబర్ 16: మేరీ మిట్టి.. మేరా కలష్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి పంపేందుకు మట్టిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సేకరించారు. దీనిని ఢిల్లీకి పంపనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరంగం రామలింగేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా సోమవారం అమృత్ కలష్ యాత్ర జరిగిందని అన్నారు. అందులో భాగంగా తమ విద్యార్థులు కళాశాల ఆవరణలో మట్టిని సేకరించారని చెప్పారు. అమరవీరుల జ్ఞాపకార్థం దేశవ్యాప్తంగా విద్యార్థులు మట్టిని సోమవారం సేకరిస్తున్నారని అన్నారు. తమ విద్యార్థులు సేకరించిన మట్టిని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ ద్వారా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌కు పంపుతామన్నారు. అక్కడ ఈ మట్టిలో మొక్కలు నాటుతారని చెప్పారు.

## లాభాల వాటా చెల్లించాలి

టేకులపల్లి,అక్టోబర్16: సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ కేవోసీ మేనేజర్ సారంగ్ సుమన్‌కు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు సోమవారం వినతి పత్రం ఇచ్చారు.

## ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్16: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు సెషన్-1, మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సెషన్-2 పరీక్షలు జరిగాయి. నగరంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టెన్త్ పరీక్షలకు 104 మంది విద్యార్థులకుగాను 90 మంది, ఇంటర్ పరీక్షలకు 112 మంది విద్యార్థులకుగాను 80 మంది హాజరయ్యారు. పరీక్షల కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సందర్శించారు.

## భార్యపై దాడి.. అడ్డొచ్చిన వారిపై కూడా..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: తన భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని దంతెలబోరకు చెందిన దంపతులు కారుమంచి అన్నమయ్య-మానస ఈ నెల 11న గొడవ పడ్డారు. మానస, అదే ఊరిలో ఉంటున్న తన అక్క వెంకటరమణ వద్దకు వెళ్లింది. అక్కడకు అన్నమయ్య వెళ్లి, భార్య మానసపై దాడికి దిగాడు. అడ్డు వచ్చిన ఆమె అక్క వెంకటరమణ, చెల్లెలు సావిత్రిపై కూడా దాడి చేశాడు. సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. వారు కోలుకున్న అనంతరం సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అన్నమయ్యపై కేసు నమోదైంది.

## పోలీస్ విధులను అడ్డుకున్న యువకునిపై..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: పోలీస్ విధులను ఆటంకపరిచిన యువకునిపై కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 14న రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వాచర్ డ్యూటీలో తేజావత్ నాగేశ్వర్‌రావు ఉన్నారు. ఆయన వద్దకు తోగ్గూడెం గ్రామ యువకుడు మహీపాల్ వచ్చాడు. వాచర్‌తో పరుషంగా మాట్లాడి, ఆయన విధులను ఆటంకపరిచాడు. వాచర్ ఫిర్యాదుతో మహీపాల్‌పై కేసు నమోదైంది.

## అంగన్‌వాడీ టీచర్ మృతి

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: మండలంలోని ఉల్వనూరు అంగన్‌వాడీ టీచర్ ఎస్.శారద(30) అనారోగ్యంతో సోమవారం వరంగల్ ఆసుపత్రిలో మృతిచెందారు.